# ముల్లు

"ఎలెన్‌కూడా...ఇలాగే అందా ?"

రుక్మిణి ప్రశ్న టార్పెడోలా తాకింది రామకృష్ణను.

ఆనంద సముద్రములో నౌకలా వున్న అతడిని చిన్నాభిన్నాలు చేసింది. చరాలున లేచాడు మంచందిగాడు. లుంగీ చుట్టుకుని వరండా లోకి వెళ్ళి పేముకుర్చీలో కూలబడ్డాడు.

సిగరెట్ ముట్టించబోయాడు. లైటర్ వెలగలేదు. మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాడు; వెలగలేదు. ఓవర్ కోటుజేబులోని అగ్గిపెట్టెను తీసి వెలిగించాడు.

మూడు సార్లు గంట కొట్టారు. ఎక్కడో.

మనస్సు ఉడుకుతూ వుంది. రాత్రి నిశ్చలంగా వుంది. తార ఇంట్లో పట్టుబడ్డ వాడిలా చంద్రుడి మొహం వెలవెలా పోతూంది.

కిటికీలో నుంచి జారుతున్న మసక వెన్నెల నామె గమనించ లేదు. బోర్ల పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తూంది. చీర ఆ ప్రక్కన నేలమీద కుప్పగా పడివుంది.

* * *

మద్రాసులో డైరెక్టర్ల వార్షిక సమావేశం, గుంటూరులో ఏదో శిక్షణ తరగతుల ప్రారంభం. తిరువనంతపురంలో ప్రాంతీయ విక్రేతల గొడవ, షిమోగా ఫ్యాక్టరీలో కార్మికులతో సంప్రదింపులు – ఇలా వరసగా

పదకొండు రోజులపాటు రోజుకు ఇరవై గంటలు తిరిగి పనిచేసి, అలసిన రామకృష్ణ హైదరాబాద్ కని బయలుదేరి మద్రాసు చేరాడు.

అప్పటి కప్పుడు అనుకుని అద్దె కారొకటి తీసుకొని మహాబలిపురం చేరాడు. బీచ్ ఒడ్డున కాటేజి తీసుకున్నాడు.

చుట్టు సరుగుడు చెట్లు, నేలతల్లి నవ్వి నట్లున్న ఇసుక, రా రమ్మని పిలిచే నీలి నీలి సంద్రం, అన్నిటికన్న ఆ ఏకాంతం-ఎంతో హాయిగా అని పించింది.

ఒక్కటే లోటు... రిక్కీ తన పక్కన లేకపోవడం - హఠాత్తుగా ప్రాణం విసిగిపోయి. తానిలా వచ్చాడుగాని పెళ్ళయిన తొమ్మిదేళ్ళలో ఎప్పుడూ ఆమె లేకుండా తాను హాలిడేమీద వెళ్ళలేదు...

స్విమ్మింగ్ ట్రంక్స్ వేసుకుని నీళ్ళలోకి దిగాడు. చల్లని చేతులతో ఆ నీరు అతడిని పొదువుకుంటుంటే ఆ స్పర్శ ఎంతో హాయి అనిపించింది. రిక్కీ పొట్టమీద నునుపు ఇలాగే వుంటుంది. అయినా తిరువనంతపురంలో లెయ్‌లా మీనన్....మైగాడ్ ... ఆమె నుంచి తప్పించుకు పారిపోవలసి వచ్చింది. తనది రిక్కీది వేరే ప్రపంచం... అందులోకి ఇంకెవరూ రాలేదు.... రారాదు.

'హాయ్ !'

నీళ్ళలో తేలుతూ తిరిగి చూశాడు.

సాయంకాలపు ఎండ రంగులో కలిసిపోయిన బంగారు ముంగురులు- ఆ రబ్బరు కుళ్ళాయి అంచుల నుంచి కన్పిస్తున్నాయి. ఆ నీలి కళ్ళు ఎంతో స్వచ్ఛంగావున్నాయి. ఆమె శరీరం అలలు నిండిన సముద్రం.

'హాయ్'

"ఐ యామ్ ఎలెన్ బ్లూమెంతాల్ !" అని తన్ను తాను పరిచయం చేసుకుంది.

తనపేరు చెప్పాడు. తాను మధ్యాహ్నం వచ్చిందట. అర్జునుడి తపస్సు శిల్పం. పాండవుల రథాలు అన్నీ చూచిందట.

నీళ్ళల్లో తేలుతూ ఈదుతూ ఆమె చెప్పినవన్నీ విన్నాడు.

ఓ అరగంటయ్యాక ఆమె ఒడ్డుకు నడిచింది. ఇలాటి మెర్‌మెయిడ్ శరీరం చూచే, శిల్పి ఉలి శిలకు జీవం పోస్తుందేమో!

ఆమె గలగల మాట్లాడుతూనే ఒళ్ళు తుడుచుకుంది. పెద్ద పూల ప్రింట్లున్న పొడుగాటి గౌన్‌ను కప్పుకున్నట్లుగా వేసుకుంది. తాను ఇండియా కిది రెండోసారి రావడం అట. మొదటి సారి తనూ, రాబర్టూ— అంటే తన మొదటి మొగుడూ ఆరేళ్ళ క్రింద వచ్చారట. తర్వాత ఇద్దరూ విడిపోయారట. అబ్బాయి రాబర్ట్‌తోనే వుంటున్నాడట. మళ్ళీ తను స్టీవ్ బ్లూ మెంతాల్‌ను పెళ్ళాడిందిట. అతను డెట్రాయిట్ కార్ల ఫ్యాక్టరీలో "సమ్‌సార్ట్ ఆఫ్ చీఫ్" అట. టోక్యోకు ఇద్దరూ వస్తే అక్కడి నుంచి అతడు అర్జంటుగా స్టేట్స్‌కు వెళ్ళిపోయాడట. తను మాత్రం అనుకున్నట్టుగా ఇండియాకు వచ్చిందట.

రామకృష్ణ తన వివరాలన్నీ చెప్పాడు. సాండ్‌విచెస్ తిని మామిడి పళ్ళరసం తాగారు.

అది తాగుతుండగా చెప్పిందామె...

"ఇండియా చాలా గొప్పదేశం. అందమైన దేశం నిజమే... దారిద్ర్యం వుంది. అది పరాయిపాలనలో వచ్చింది. కొన్నేళ్ళకు తప్పక పోతుంది. కాని ఈ ఎండ, ఈ సముద్రం ఆ నాట్యం, ఆ శిల్పాలు, మధుర, కంచి, ఖజురహో, ఎల్లోరాలు, హిమాలయాలు ఎంత కష్టంలోనయినా తలెత్తుకుని నిలబడగల్గే జనులు అబ్బబ్బ మీ కళ్ళు ఎంత బాగుంటాయో చెప్పలెను. మిష్టర్ రాం! మీ దేశంలోవాళ్ళు బహుశా ఎక్కువ తిరగరేమో అంచేత వారికి ఇది తెలియదేమోకాని ఐ లవ్ ఇండియా అండ్ ఇండియన్స్—"

అని గ్లాసు క్రింద పెట్టి—"మరిచాను... మేంగో ఈస్ మై ఫేవరిట్" అని నవ్వింది. మూదురు ఎరుపు లిప్‌స్టిక్ పెదవుల వెనక ముత్యాలవంటి పలువరుస ... రామకృష్ణ కళ్ళ నాకర్షించింది.

"మిస్టర్ రాం! సాయంత్రం ఎవరో గైడట వచ్చి రాని ఇంగ్లీషులో నన్ను ఊదరగొట్టాడు. కాని నాకు ఆ అర్జునుడి తపస్సు శిల్పం మరో సారి చూపించరూ?" అని లేచింది ఎలెన్.

"ష్యూర్లీ మిసెస్ బ్లూమెంతాల్," అం తనూ లేచాడు.

"కాల్ మి ఎలెన్!"

కారు దిగి నెమ్మదిగా నడవసాగా రిద్దరు అక్కడ కూడా దీపాలు వెల్గుతున్నాయి. ఒక రిద్దరు గైడ్‌లు వెంటపడగా తరిమి వేశారు. ఒకటి రెండుసార్లు ఆమె భుజం తనకు తగిలినప్పుడు ఒళ్ళు జల్లుమంది.

రామకృష్ణ ఆశ్చర్యపడ్డాడు. తనింత కాన్షస్‌గా వున్నాడేమిటివాళ. తను డైరెక్టర్ హోదాలో ఎంతమంది స్త్రీలతో మెలిగాడు, మాట్లాడాడు? ఒంటరిగా వాళ్లతో ప్రయాణాలు చేశాడు గాని, ఈ ఫీలిం గెప్పుడూ రాలేదే...'

'రిక్కీ... నువ్వు నాతో వుండాలి ఈపూట' అనుకున్నాడు.

వెన్నెలలో- ఆ అర్జునుని రాతిశిల్ప ఫలకం మీద వెలుగునీడలు మాటలకు మించిన భావాలను చెబుతున్నాయి.

పల్లవులు, కఠినశిల, ఏకశిలా విమానాలు, నగర వేసార విమానాలు, అర్జునుడు, పాండవులు, కౌరవులు, కురుక్షేత్రం, పాశుపతాస్త్రం- తపస్సు అన్నీ వివరంగా చెప్పసాగాడు రామకృష్ణ. చరిత్ర, పురాణం, సౌందర్యం, శిల్పం, భక్తి, ఆరాధన- అన్ని కలిసి ఒక గంగా ప్రవాహమై

ఈ దేశంలో కాలానికి ఎలా వారధిగా నిలిచిందీ అతడు చెబుతుంటే తన్మయత్వంతో విన్నది ఎలెన్. ఇద్దరూ ఓ నిమిషం మాట్లాడకుండా చూశారు. "రాం... అర్జునుడికి భార్య లెందరు ?" ఆ ప్రశ్నకు ఉలిక్కిపడిన రామకృష్ణకు మొదటిసారిగా ఆమె తన భుజానికి ఆనుకుని నిల్చుందని తెలిసింది.

"అర్జునుడికా" అని సిల్లీ నవ్వొకటి నవ్వి ముగ్గురో, నల్గురో వుంటారు. అతగాడు పూర్వజన్మలో అరబ్ 'షేక్' అయివుంటాడు !"

ఎలెన్ విరగబడి నవ్వింది ఓహ్! రాం అని అతడి బుజాలు పట్టుకు కుదిపింది.

ఆమె ముంగురులు అతని చెంపలను స్పృశిస్తుంటే ఆమె ఒంటి మీద సెంటు అతడిని చీలుస్తుంటే కళ్లు మూసుకున్నాడు .. "నేనిక్కడికి వచ్చి వుండకూడదు" ఒంటరిగా-

ఇద్దరూ కాటేజీ చేరారు. డిన్నర్ దగ్గర ఆ శిల్పసుందరి మాటాడుతుంటే వింటున్నాడే తప్ప రామకృష్ణ గ్రహించడం లేదు.

భోజనం అయ్యాక ఆమె కాటేజిదగ్గర ఆమెను వదిలాడు. 'థాంక్యూ-రాం... థాంక్యూ వెరిమచ్-' అంది అతని చేతిని తన చేతిలోకి తీసుకుని ఎలెన్.

ఏదో చెప్పేసి గబగబ తన కాటేజిలోకి వచ్చి అడ్డంగా మంచంమీద పడ్డాడు రామకృష్ణ. నాలుగు సిగరెట్లు త్రాగాడు. ఎక్కడో పార్టీలో తప్ప పుచ్చుకోని తాను- బేరర్ని పిలిచి విస్కీ సోడా తెప్పించాడు. గటగట కసిగా తాగాడు. ఆ వెచ్చదనం శరీరమంతా పురివిప్పింది.

పడుకున్నాడు. పుస్తకం తీశాడు. రెండు పేజీలుకూడా చదవకుండానే మూసేశాడు. కళ్ళుమూసుకున్నాడు, రిక్కీ శరీరంలోని ఒక్కొక్కభాగాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. ఆ తొమ్మిదేళ్ల తమ ఆనందపు వెన్నెలలోని వేల

వేల కిరణాల నొక్కొక్కటిగా మననం చేసుకున్నాడు. కాని, ఊహా రిక్క-నల్లని కురులకు బదులు బంగారు ముంగురులు కదలాడాయి. వీణాగానంలాటి ఆ అందాలచూపులకు మారుగా నీలి అల్లరి కనుల పియానోగానం వినిపించింది.

ఊహు .. ఇప్పుడే మద్రాసు వెళ్ళిపోతేని.... వాచి చూశాడు. పదకొండయింది. లాభంలేదు.

నైట్‌గౌన్ చుట్టుకుని లేచాడు. ఢేకాజి వెలుపలికి వచ్చాడు, చంద్రుడు నడినెత్తిమీద వెలుగుతున్నాడు. ఎంత తెల్లగా వున్నాడో. అయినా అతడిలో మచ్చ వుందిట...

సిగరెట్టు కాలుస్తూ సముద్రం ఒడ్డునే నడవసాగాడు.

ఎంత సేపు నడిచాడో. ఎంతదూరం నడిచాడో ... ఆ హోరు పక్కనున్న సముద్రానిదా లేక తనలోనిదేనా. కాళ్ళకడ్డంగా ఒకటి రెండు పెద్ద పీతలు పరుగెట్టాయి వంకరటింకరగా.

ఒకచోట కూలబడ్డాడు. నిరంతరంగా తరలివచ్చి, ఒడ్డుతో ఘర్షణపడి వెళ్లిపోతున్నాయి అలలు.

వెనక్కువాలాడు. చేతులను మడిచి తలక్రింద పెట్టుకుని ఇసుకమీద పడుకున్నాడు. నక్షత్రాల జల్లెడలో ఆకాశం చిక్కుకుని వుంది. మనిషి చంద్రుడి మీద పాదం మోపాడు. నక్షత్రం చేరే దినం ఎప్పుడొస్తుంది? వస్తుందా ? అంతంత దూరాలను జయించిన మనిషి అతి దగ్గరిదయిన తన మనసును ఎందుకు... ?

"రాం"— ఆ గొంతులో జీర....

అతడు లేవడానికి ప్రయత్నించాడు.

ఆమె లేవనివ్వలేదు.

* * *

తమ నిశ్చల ఆనంద లహరిలోకి ఆ సంఘటన విసిరిన రాతి దెబ్బకు సుడులు తిరిగింది.

శాకరిన్ బిళ్ళలా అప్పటికప్పుడు తీయగా వున్నా చివరికి మిగిలిన చేదు ఇంకా నిలచేవుంది.

ఆ మరు ఉదయం ఆమెతో చెప్పకుండానే హైదరాబాద్‌కు బయలు దేరాడు తను.

ఇంటికి చేరగానే తెల్లటిచీరతో, తన అక్కునచేరి స్వాగతం చెప్పింది రిక్కీ. కాని జ్ఞాననేత్రం లాటి ఆమె కుంకుమ బొట్టు తనవైపు ఎత్తిచూపు తోన్న వేలనిపించింది.

పన్నెండు రోజుల తర్వాత శరీరాలు దగ్గరయినప్పుడు మధ్య ఆ జ్ఞాపకం పరదా అడ్డు నిలబడింది.

"ఏమిటండీ— అక్కడెక్కడన్నా గొడవ పడ్డారా !"

"ఒంట్లో బాగులేదా ?"- "ఎం. డి. ఏమన్నా అన్నాడా ?"

"యూనియన్ ట్రబులా-" అని రిక్కీ అడిగింది. ఏవో జవాబులు చెప్పాడు కాని తన చేతుల, తన మాటలు తనకే కృతకంగా తోచాయి.

ఆ నిర్మలమైన నిజంముందు తన అబద్ధం ఎంత వికృతంగా వుంది.

ఆ చిచ్చును ఇంకా తనలో వుంచుకోలేక రెండురోజుల క్రింద ఒక రాత్రి చెప్పాడు రిక్కీతో... తళతళలాడే ఆ నయనాలను నీటి పొరలు కప్పుతుంటే, మంచులో తడిసిన పువ్వులాటి ఆ మొహం వాడి పోతుంటే, ఆ అంతరాంతరాలోని నవనీతంలాటి నమ్మకం ప్రేమ, అను రాగం, శరీరం, మనసు— కలసిన ఒక మహానిజం ముక్కలవుతోంటే తన క్షణికోద్రేకం ఎంతటి ఘోరమో తెలిసింది.

అయినా సరే చెప్పేశాడు. కనీసం తామిక దాగుడు మూత లాడ నక్కరలేదు.

నేను మూర్ఖుడిని ? నా దేవత కూర్చున్నచోట విరిగిన బొమ్మను కూచోబెట్ట యత్నించిన వాడిని. "నన్ను ఎన్నన్నా అను- ఏమన్నా అను కాని మనిద్దరి మధ్య దూరం రానివ్వకు-" అని ఏడిస్తే ఆమె చీర చెంగుతో తుడిచింది.

కాని అయిదారు రోజులు మాటలు లేవు. ఆ తర్వాతయినా ఎవరో అపరిచితులు ఒక ఇంట్లో వున్నట్టుంది కాని ఆ మునుపటి వెలుగులేదు.

రెండు మనసులు, రెండుశరీరాలు ఒక్కటయినచోట వంద మనసులు రెండు శరీరాలు వున్నట్టయింది.

చివరికి ఇన్ని యుగాల తర్వాత- శరీరం ద్వారానయినా మనసును మనసుకు దగ్గరగా చేరుద్దామని, అంతరంగం మీది గాయాన్ని పెదాల తడితో తుడుద్దామని కొత్తగావచ్చిన ఈ అగాధాన్ని జంటగా ఎగిరి దాటి అదిగో అవతల వున్న తమ పూర్వపు నందన వనంలోకి వెళ్దామని ప్రయత్నిస్తే రిక్కి అడిగింది. 'ఎలెన్' కూడా ఇలాగే అందా ?

హు !

తన మనసున నాటిన ఒక ముల్లులాంటి అనుభవాన్ని పెకలించి ఆమె మనసులో జ్ఞాపకంగా నాటాడు.

తను చేసింది సరియేనా ?

ఆమె మనసు అరిటాకు మీద నాటిన ఆ ముల్లుకు- పాపం, ఆమె ఎంత విలవిలలాడుతున్నదో.

ఆ ముల్లును తీసిపారేయగల శ్రావణం - కాలమా లేక తమ - తమ అనురాగమా- ?

-ఇంకో సిగరెట్ వెలిగించాడు రామకృష్ణ.

తూర్పు ఆకాశంమీద సన్నని వెలుగు రేఖ పొడ సూపింది.

—( ౦ )—